క్లుప్తంగా

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మక్తల్: రాష్ట్రీయ కళామందిర్ సింగిడి – 2024 పేరుతో నిర్వహిస్తున్న విద్యార్థి సాంస్కృతిక పోటీల వాల్‌పోస్టర్‌ను ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు.. ఈ నెల 20, 21తేదీలలో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ వేదికపై జరగనున్న కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని ఏబీవీపీ నాయకులు వినయ్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు వంశీ, నిహాల్, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



మక్తల్: పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ భీమా అధ్యక్షుడు అంబాదాస్‌రావు ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 120మంది రోగులకు చికిత్సలు చేయగా వారిలో కంటి ఆపరేషన్ కోసం 40మందికి కంటిసమస్య ఉందని ఆపరేషన్ కోసం ఏనుగొండ కందూర్ రాంరెడ్డి కంటి ఆస్పత్రికి వాహనంలో తరలించారు. అంతకు ముందు కంటి పరీక్షలు చేసిన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు అంబాదాస్, అనుగొండ శ్రీనివాసులు, రమేష్‌రావు, వాదిరాజ్, రీజియన్ చైర్మన్ రమేస్‌రావు, పృథ్వీరాజ్, డీవీచారి, సత్యఆంజనేయులు, చంద్రకాంత్‌గౌడ్, పృథ్వీరాజ్, అంజన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం



నారాయణపేట: మహబూబ్‌నగర్ ఏఈఎస్ నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు బుధవారం మండలంలోని ఊటకుంట తాండ, ఒండుచెలిమితాండ, మేకహన్మన్‌తాండ, కోటకొండ, తిర్మలాపూర్ గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు చేసి వెయ్యి లీటర్ల బెల్లం ఊట, 45లీటర్ల సారా యిని ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సీఐ అశోక్‌కుమార్, డీటీఎఫ్‌సీఐ వీరారెడ్డి, ఎస్‌ఐలు రమేష్, గురువయ్య,ఎక్సైజ్ సిబ్బంది ఉన్నారు.

మద్యం పట్టివేత

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండల కేంద్రంలోని వైన్ షాపుల నుంచి ఎక్కువ మొత్తంలో మద్యం తరలిస్తున్న వారిని పోలీసులు సీజ్ చేసిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. అప్పిరెడ్డిపల్లికి చెందిన బోడా అంజప్ప 7.65 లీటర్ల మద్యం, అలాగే ఖాజీపూర్ గ్రామానికి చెందిన నిరటి లాలమ్మ 6.6 లీటర్ల మద్యాన్ని వారి గ్రామాలకు తీసుకెళ్తున్న క్రమంలో మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ రాంలాల్ తెలిపారు. వీరిపై కేసునమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ మద్యం విలువ సుమారు రూ. 7వేల వరకు ఉంటుందన్నారు.

అక్రమ నిర్మాణాలకు నోటీసులు ఇస్తాం..



మరికల్: ఆర్టీసీ బస్టాండ్ ఎదుట ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 1లో అక్రమంగా దుకాణాలను నిర్మిస్తున్న వారికి నోటీసులు జారీచేసి వాటిని తొలగిస్తామని తహసీల్దార్ సునిత అన్నారు. సర్వే నివేదికను ఇవ్వాలని బుధవారం అఖిలపక్షం నాయకులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వారితో మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని సర్వే చేయగా రికార్డు ప్రకారం ప్రభుత్వానికి చెందిన 30గుంటల స్థలంలోనే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు సర్వే బృందం తెలిపిందన్నారు. అక్కడ అక్రమ నిర్మాణాలను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటుచేస్తామని ఆమె తెలిపారు. అఖిలపక్షం నాయకులు రాజేష్, వీరన్న, హరీష్, రఘు, రాజు, కృష్ణయ్య, వేణు, హసన్ పాల్గొన్నారు.

అదుపు తప్పి లారీ బోల్తా..

మాగనూర్: మండల కేంద్రంలోని ఓబ్లాపూర్ గేట్‌సమీపంలో లారీబోల్తా పడిన సంఘటన బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా.. హైదరాబాద్ నుంచి కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు లోడ్‌తో వెళ్తున్న లారీ ముందువెళ్తున్న టిప్పర్‌ను ఓవర్‌టాక్ చేయడానికి ప్రయత్నించిందని అదేసమయంలో లారీ అదుపు తప్పడంతో కుడివైపు రోడ్డు పక్కన ఉన్న ఓ చెట్టును ఢీకొట్టి బోల్తాపడింది. ప్రమాద సమయంలో లారీలో డ్రైవర్‌తో పాటు క్లీనర్ ఉన్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎవరికి ఎలాంటి గాయాలు కాలేదు. స్థానిక ఎస్‌ఐ ఎండీ అబ్దుల్ ఖాదర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

క్రీడా రంగానికి ప్రోత్సాహమేది?

- గ్రామాలకు దూరంగా క్రీడా ప్రాంగణాలు
- పోటీల నిర్వహణకు చిల్లిగవ్వ ఇవ్వని ప్రభుత్వం
- పాఠశాలలో ఆటలకు దాతలే దిక్కు



ఇరుకు స్థలంలో క్రీడలు ఆడుతున్న విద్యార్థులు



ఎలిగండ్లకు కిలోమీటర్ దూరంలో ఉన్న క్రీడా ప్రాంగణం

మరికల్: గ్రామీణ స్థాయి క్రీడాకారులు రాణిస్తేనే దేశ ప్రతిష్ట పెరుగుతుందని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడా టోర్నమెంట్లకు స్థలాలు లేక పోవడమే కాకుండా ఆటల అభివృద్ధికోసం చిల్లిగవ్వ మంజూరు చేయకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరం కావాల్సిన పరిస్థితి దాపురించింది. మండలంలో ఐదు ఉన్నత పాఠశాలలు, 23ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ఎక్కడ కూడా క్రీడా మైదానం లేదు. నిబంధనల ప్రకారం పాఠశాల విద్యార్థులకు క్రీడా టోర్నమెంట్లను నిర్వహించేందుకు ఐదు ఎకరాల స్థలం ఉండాలి. స్థలం లేకపోవడంతో ఇరుకైనా స్థలంలోనే విద్యార్థులకు ఆటలు ఆడించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయించింది. కానీ అవి గ్రామాలకు దూరంగా ఉండటంతో ఉపయోగంలోకి రాకపోవడంతో క్రీడా ప్రాంగణాలు ముళ్లచెట్లతో కమ్ముకుపోయాయి. మండలంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలో వెయ్యిమందికి పైగా విద్యార్థులు ఉన్నారు. కాని ఇక్కడ అర ఎకరా స్థలం కూడా లేకపోవడంతో ఆగస్టు–15, జనవరి 26న నిర్వహించే క్రీడాపోటీలను దాతల సహకారంతో ఇబ్బందుల మధ్యన నిర్వహించాల్సిన పరిస్థితి తలెత్తింది. ఇదే పరిస్థితి అన్ని పాఠశాలలో నెలకొంది. విద్యార్థులు క్రీడలకు దూరం కావడంతో ఆటల సామగ్రి గదులో మూలనపడ్డాయి.

పాఠశాల స్థాయిలో నిర్వహించే క్రీడలు

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, సాఫ్ట్‌బాల్, టెన్నికాయిట్, ఫుట్‌బాల్, హాకీ, క్రికెట్ తదితర ఆటలను ఆడించాలి. ఒక పక్క పాఠశాల ఆవరణలో క్రీడా మైదనాలు లేక, మరోపక్క ప్రభుత్వం నుంచి నిధులు రాక పెద్ద టోర్నమెంట్లకు విద్యార్థులు ఎంపిక కావడం లేదు.

ఉపయోగించుకోవాలి



గత ప్రభుత్వం నిర్మించిన క్రీడా ప్రాంగణాలను ఉపయోగంలోకి తీసుకురావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలి. అవి ఉపయోగించుకోకపోవడంతో ముళ్లచెట్లతో కమ్ముకుపోయాయి. దీంతో పాఠశాల ఆవరణలో ఉన్న ఇరుకు స్థలాల్లోనే ఆటలు ఆడాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను బయటకు తీసేందుకు నిధులు మంజూరు చేసి టోర్నమెంట్లను నిర్వహిస్తే బాగుంటుంది.

– తిరుపతయ్య, అప్పంపల్లి

నిధులు మంజూరు చేయాలి



ప్రభుత్వం ప్రత్యేక నిధులు మంజూరుచేసి విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేసి పాఠశాలస్థాయిలో పోటీలు నిర్వహించాలి. ప్రస్తుతం దాతల సహకారంతోనే పాఠశాల స్థాయిలో క్రీడలు నడుస్తున్నాయి. ప్రభుత్వం తరుపున కూడా పోటీలు జరిగితే విద్యార్థులు జిల్లా రాష్ట్రస్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది.

– వెంకటేష్, విద్యార్థి, పల్లెగడ్డ

చర్యలు తీసుకుంటాం..

పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన క్రీడా ప్రాంగణంలోనే విద్యార్థులకు ఆటలు నిర్వహిస్తున్నాం. కొన్ని గ్రామాల్లో పాఠశాలకు దూరంగా ఉన్నా వాటిదగ్గరకు విద్యార్థులు వెళ్లడం లేదు. పాఠశాలలకు దూరంగా ఉన్నా మైదానాల్లో ముళ్లచెట్లను తొలగించి ఉపయోగంలోకి తీసుకురావడం కోసం చర్యలు తీసుకుంటాం.

– అంజలిదేవి, ఇన్‌చార్జ్ ఎంఈఓ, మరికల్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ

నారాయణపేట రూరల్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ ఆంజనేయులు సూచించారు. ఎస్పీ ఆదేశాల మేరకు తొలి బుధవారం టౌన్, రూరల్ పీఎస్‌ల ఆధ్వర్యంలో వేర్వేరుగా సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా సింగారం క్రాస్‌రోడ్డులోని గురుకుల హాస్టల్‌లో విద్యార్థులకు, అప్పక్‌పల్లి చెరువు వద్ద ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. అపరిచితులపై అప్రమత్తంగా ఉండాలని, తెలియని వారికి సెల్ ఫోన్ ఇవ్వడం చేయొద్దన్నారు. లాటరీ తగిలిందని, తక్కువ ధరలకు ఆన్‌లైన్‌లో వస్తువులు అమ్ముతున్నట్లు ప్రకటనలు చూసి మోసపోవద్దన్నారు. ఎక్కడైన అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీనంబర్ 193, డయల్ 100, 112లకు ఫోన్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్, హోంగార్డులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి



పేరపళ్లలో కూలీలతో మాట్లాడుతున్న బాలప్ప



దామరగిద్దలో మాట్లాడుతున్న గోపాల్

నారాయణపేట రూరల్: ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాలప్ప డిమాండ్ చేశారు. మండలంలోని పేరపళ్లలో కొనసాగుతున్న ఉపాధిపనుల వద్దకు వెళ్లి కూలీలతో మాట్లాడారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. మంచినీరు, టెంటు, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న వేతనాల చెల్లింపు డిమాండ్‌తో ఈ నెల 6న నిర్వహిస్తున్న కలెక్టరేట్ ధర్నాకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కోరారు.

దామరగిద్ద: ఉపాధి కూలీల సమస్యలపై ఈ నెల 6న కలెక్టర్ కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమానికి కూలీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముస్తాపేట్‌లో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీలను కలిసి సమస్యను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ఆరు వారాలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి కూలీ డబ్బులను వెంటను అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలప్ప, డీవైఎఫ్‌ఐ నాయకులు భీంషన్, అంజప్ప, గోవింద్, బాలప్ప పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల మోత

నర్వ: గ్రామాల్లో ఇటీవల విద్యుత్ బిల్లులు అందుకున్న ప్రజలు షాక్‌కు గురవుతున్నారు. ప్రతినెల వచ్చే బిల్లుల కంటే అదనంగా రెండు రెట్లు బిల్లులు వచ్చాయని వారు వాపోతున్నారు. ఒక్కో ఇంటికి ప్రతినెల రూ.150నుంచి రూ.250 వరకు వచ్చే బిల్లులు కొంతమందికి రూ. 1000లోపు, మరికొందరికీ రూ.1500 నుంచి రూ.1800 వరకు బిల్లులు వచ్చినట్లు వారు గగ్గోలు పెడుతున్నారు. అసలే వేసవిలో ఎండలు రోజు రోజుకు పెరుగుతున్న క్రమంలో కనీసం ఇంట్లో ఫ్యాన్‌లు వేసుకోవాలన్నా ఈ బిల్లులను చూసి ప్రజలు బెంబెలెత్తుతున్నారు. దీనిపై విద్యుత్ అధికారులు ఎలాంటి స్పందన లేక పోగా విద్యుత్ వినియోగించినంతా బిల్లులు వస్తాయని ఉచిత సలహాలు ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై విద్యుత్ అధికారులు స్పందించి బిల్లులను తగ్గించాలని వారు కోరుతున్నారు.

కారోబార్‌కు ఘనంగా వీడ్కోలు



ఊట్కూరు: మండలంలోని గ్రామ పంచాయతీలో 30 ఏండ్లుగా విధులు నిర్వహిస్తున్న పంచాయతీ సెక్రటరీ జి. సత్యనారాయణకు బుధవారం ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ మేరకు.. ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయనను పూలమాలశాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన గ్రామానికి అందించిన సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పోలప్ప, కార్యదర్శి శ్రీనివాస్ రావు, ఉదయ్, అశోక్, కనకప్ప పాల్గొన్నారు.

పూర్ణచంద్రయాదవ్‌కు సన్మానం



కోస్గి: జిల్లాలో విద్యా విషయక, సంస్కృతిక మాసపత్రిక 'నిలువురాళ్లు' మార్చినెల సంచికకు ప్రింటింగ్‌కు ఆర్థికసాయం చేసిన శ్రీ హర్ష క్లినిక్ యజమాని పూర్ణచంద్ర యాదవ్ దంపతులను బుధవారం విద్యాశాఖ ఏఎంఓ విద్యాసాగర్, సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు శాలువాతో సత్కరించారు. విద్యార్థులకోసం మాస పత్రికకు తోడ్పాటు అందించడంతో అభినందనీయమని ఏఎంఓ పేర్కొన్నారు.

దొడ్డి కొమురయ్యకు నివాళి



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

నారాయణపేట: దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో బుధవారం ఆయన చిత్రపటానికి వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దొడ్డి కొమురయ్య ఉద్యమ స్ఫూర్తి, వారి త్యాగాన్ని కొనియాడారు. కార్యక్రమములో జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి కృష్ణమచారి, సివిల్ సప్లై అధికారి సుదర్శన్, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ హరినాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు సన్మానం



మక్తల్: మండలంలోని పంచాయతీరాజ్ ఏఈగా పని చేస్తున్న లక్ష్మీనారాయణ బుధవారం పదవీ విరమణ పొందుతున్న సందర్భంగా బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఉద్యోగ రీత్యలో పనిచేస్తూ మంచి సేవలందించారని కొనియాడారు. అనంతరం మండల ఏఈ లక్ష్మీనారాయణను శాలువాతో సన్మానం చేసి అభినందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ప్రతాప్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకటేష్, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



మరికల్: మండల కేంద్రంలోని విశ్వహిందు పరిషత్, భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో బుధవారం ఛత్రపతి శివాజీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చౌరస్తాలో ఛత్రపతి విగ్రహానికి పూలమాల వేసినివాళులర్పించారు. కార్యక్రమంలో లక్ష్మీకాంత్‌రెడ్డి, అనిల్, తిరుపతయ్య, రవి, రాజు, శ్రీకాంత్‌రెడ్డి, రఘు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



నారాయణపేట రూరల్ : పట్టణంలోని శ్రీహంస వాహిని ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయం పాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివిద్యార్థులుకు విద్యాబోధనచేశారు. అనంతరం చక్కగా బోధించిన వారికి పాఠశాల యాజమాన్య సభ్యులు, ఉపాధ్యాయులు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాజేష్‌కుమార్, యాజమాన్యసభ్యులు సంతోష్‌కుమార్, సుజాత, టీచర్లు ప్రియాంక, సంగీత, సౌజన్య, విజయ, ఆనంద్, ఉదయ్, అమల, శిరీష, రేవతి పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కల్పించాలి

ఊట్కూరు: ఉపాధి కూలీలు పనిచేసే చోట్ల వారికి వసతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరామారెడ్డి అన్నారు. బుధవారం తిప్పరాస్‌పల్లి శివారులో పనులు చేస్తున్న ఉపాధి కూలీల వసతులను ఆయన పరిశీలించారు. వేసవి కాలంలో ఉపాధి కూలీలకు అధికారులు కల్పిస్తున్న వసతులు గురించి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎండలు అధికంగా ఉండడంతో పనులు జరిగే వద్ద టెంట్‌లను ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు స్పందించి కూలీలకు వారం వారం డబ్బులు చెల్లించాలని ఆయన కోరారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ విజయం కోసం కృషిచేయాలి

- ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

మక్తల్: పాలమూరు పార్లమెంటరీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపునకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు కృషిచేయాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం పట్టణంలోని తన నివాసంలో కాంగ్రెస్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి గెలుపునకు నియోజకవర్గంలో ప్రతి కార్యకర్తలు కాంగ్రెస్ గెలుపునకు కృషి చేయాలని కోరారు. సీఎం రేవంత్ ప్రవేశ పెట్టిన ఆరు గ్యారంటీల పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యకర్తలు తమపై నమ్మకం పెట్టి భారీ మోజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే బుధవారం పట్టణంలో షరిఫా మజీద్ వద్ద పట్టణ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి హాజరైయ్యారు. అనంతరం వారిని శాలువాతో సన్మానం చేశారు. కార్యక్రమంలో టీపీసీ గీతకార్మిక సంఘం చైర్మన్ నాగరాజ్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, బీకేఆర్ పౌండేషన్ చైర్మన్ బాలకృష్ణారెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ బంగ్లాలక్ష్మీకాంత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గణేష్ కుమార్, విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, అనంద్‌గౌడ్, రాజప్పగౌడ్, చెన్నయ్యగౌడ్, గోపాల్‌రెడ్డి, గణేష్‌కుమార్, విఘ్నేశ్వర్‌రెడ్డి, రవికుమార్, కావలి తాయప్ప, కోళ్ల వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటరు మ్యాపింగ్‌పై అభినందనలు..

నర్వ: మండలంలోని లంకాల్‌లో కాంగ్రెస్ నాయకులు బీసం రవికుమార్ వందశాతం ఓటరు మ్యాపింగ్ చేయడంపై ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, ఎంపీ అభ్యర్థులు ఆయనను శాలువాలతో సన్మానించి అభినందించారు. నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేక్‌వర్ధన్‌రెడ్డి, తదితరులున్నారు

సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్



లింగల్‌చేడ్‌లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

మద్దూరు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాలైనా లింగల్‌చేడ్, పెద్దపూర్ గ్రామాల్లో బుధవారం కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికే ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు మద్దూరు –2 ఎస్‌ఐ శ్యాంసుందర్ తెలిపారు. ప్రజలకు ఎన్నికలపై అభద్రతభావం లేకుండా భరోసా కల్పిస్తామని ఆయన తెలిపారు.

నర్వ: ప్రజల భద్రత కోసమే పోలీస్‌లు, కేంద్రసాయుధ బలగాలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్నామని ఎస్‌ఐ కురుమయ్య అన్నారు. బుధవారం పెద్దకడ్మూర్, కల్వాల్, సీపూర్ గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ సిబ్బంది, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ధన్వాడ: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో వరి కొనుగోలు కేంద్రాన్ని అధికారులు బుధవారం ప్రారంభించారు. అలాగే గున్ముక్లలో ప్రారంభించారు. ఈ మేరకు.. సీఈఓ వెంకట్రాములు మాట్లాడుతూ.. వరి మద్దతు ధర గ్రేడ్ ఏ రకానికి రూ.2203, సాధారణ రూ. 2183 ధరలకు ప్రభుత్వం కొనుగోలు చేయనుంది. దెబ్బతిన్న రంగు మారిన మొలకెత్తిన పురుగు తొలచిన గింజలు 3శాతం తీయబడునని వ్యవసాయ అధికారితో ఆధార్ జిరాక్స్, పట్ట పాస్ బుక్, బ్యాంక్ ఖాతా, ఏఈఓ ధ్రువీకరణ పత్రాలు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకట్రాంరెడ్డి, డైరెక్టర్లు శ్రీనివాస్ గౌడ్, మాజీ చైర్మన్ నిరంజన్‌రెడ్డి, రహెమన్‌ఖాన్, వెంకట్రాములు, లక్ష్మయ్యగౌడ్, కొండారెడ్డి, నారాయణస్వామి పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహులు

నారాయణపేట రూరల్: బాలల హక్కులపై ప్రతీ విద్యార్థి పూర్తిగా అవగాహన కల్గి ఉండాలని చైల్డ్ హెల్ప్‌లైన్ డిస్ట్రిక్ కో–ఆర్డినేటర్ నర్సింహులు అన్నారు. మండలంలోని ఊటకుంటతండా ప్రభుత్వ పాఠశాలలో బుధవారం అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో జీవించడానికి సర్వ హక్కులను కల్గి ఉంటారని, బలవంతంగా పనులు చేయించడం, బడి మాన్పించడం చేస్తే చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. ఏమైన సమస్యలు ఉంటే 1096 హెల్ప్‌లైన్ నంబర్‌కు కాల్‌చేసి చెప్పాలన్నారు. చిన్నారుల సంరక్షణకు బాలరక్షభవన్ అందుబాటులో ఉందని తెలిపారు.హెచ్‌ఎం బంకుల శంకర్, ఉపాధ్యాయులు తార్యానాయక్ పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణం చేపట్టరా?



కూలిపోయిన పాఠశాల ప్రహరీ

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ప్రహరీకూలి నెలలు గడుస్తున్న అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రహరీ కూలడంతో నిత్యం పాఠశాలలోకి పందులు, పశువులు వస్తున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల సమయంలో వీటితో తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయంటున్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు సమీపిస్తుండటంతో విలువైన సామగ్రితోపాటు విద్యార్థులు రికార్డులకు భద్రత కరువైందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి కూలిన ప్రహరీని నిర్మించాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

అలరిస్తున్న బ్రహ్మంగారి నాటిక ప్రదర్శన

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో మంగళవారం రాత్రి రెండోరోజు విరాట్ పోతులూరి వీరబ్రహ్మంగారి జీవిత చరిత్రపై నాటిక ప్రదర్శన గ్రామస్తులు అధిక సంఖ్యలో వచ్చి తిలకించారు. కళాకారులు తమ పాత్రలో ఒదిగి ప్రదర్శన చేయడంతో గ్రామస్తులు అభినందించారు. వివిధ గ్రామాల నుంచి పెద్ద చింతకుంటకు తరలివెళ్తున్నారు.

కాట్రేవ్‌పల్లిలో బీరప్ప జాతర



ఎల్లమ్మ దేవాలయం వద్ద పసుపు చల్లుకున్న భక్తులు

మక్తల్: మండలంలోని కాట్రేవ్‌పల్లిలో బుధవారం బీరప్ప జాతర ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈమేరకు.. భక్తులు ఆలయానికి ఊరేగింపుగా వెళ్లి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లమ్మకు నైవేద్యం పెట్టి అమ్మవారికి పూజలు చేశారు. జాతర ఉత్స వాలు నాలుగురోజులపాటు కొనసాగనున్నాయి. గ్రామంలో ఎల్లమ్మ ఆలయం వద్ద బండార కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కుర్వ కులస్తులు పసుపు ఒంటిపై చల్లుకుంటే తమకు సుఖసంతోషాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్ర, హైదరాబాద్ తదిర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. బండారు ఉత్సవాల్లో దాదాపు 15వేల మంది భక్తులు రావడంతో సౌకర్యాలకోసం టెంట్లువేసి బండారును చల్లుకునేందుకు ఎంతో పోటీపడ్డారు. ఎల్లమ్మ ఆలయంలో ఉన్న బండారును పోటీపడి పసుపును తమకుటుంబ సమేతంగా చల్లుకున్నారు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నిర్వాహకులు గద్దం నర్సప్ప, ఎల్లప్ప, సిద్ధప్ప, వెంకటేష్ పాల్గొన్నారు.